ప్రేమించిన పెళ్లికొడుకు

ఎస్. అనంతలక్ష్మి

'పోస్ట్' వాకిట్లోంచి పోస్ట్‌మేన్ గావు కేక పెట్టాడు. ఊడిపోయిన చీరంగోచీ సరిగ్గా పెట్టుకుంటూ గబగబా వాకిట్లోకి వచ్చింది శారదమ్మ. పోస్ట్‌మేన్ అందించిన కవరు అందుకుని వంటింట్లోకి వెళ్లింది. పీట మీద కూచుని కవరు విప్పింది ఆపేక్షగా,

'డియర్ ఉషా కాంతి!'

తమరి దర్శనం అయి చాలా రోజులైంది. రోజూ పబ్లిక్ గార్డెన్స్ అంతా యీమూలనుంచి ఆ మూలకి తిరగలేక ఛస్తున్నాను. కాలేజీలో కలుద్దామంటే మా ఆఫీస్‌నుంచి వినా కాలేజీకి వచ్చేసరికి ఆ టైమ్‌కి ఉషమ్మగారు నెమ్మదిగా యిల్లుచేరుకుని ఉంటారు. అప్పు డప్పుడు కాలేజీనుంచి చల్లని గాలి కోసం పబ్లిక్ గార్డెన్స్‌కి వచ్చేవాళ్ళు కదా వెలుతోటి అని వారంరోజుల్నుంచి పబ్లిక్ గార్డెన్స్‌లో పడిగాపులు కాస్తున్నాను. ఉహూఁ, అయినా దేవిగారి దయ కలుగలేదు. అయినా నే నెందుకు గుర్తుంటాలే యింక నీకు. నాకన్నా బాగా కబుర్లుచెప్పి నిన్ను బుట్టలో వేసుకునే ఆ మధో — మధురివెూ దొరికిందిగా, అయినా మనం యిలా కల్సుకోవటం కుదిరేటప్పటికి నీకో నాకో పిల్లలు కూడా పుట్టచ్చనుకుంటాను. ఏమంటావు ఉషా, అందుకని ఓ ఉషారాణీ గారూ, రేపు మేట్నీ షోకి సాగర్‌లో కలుసుకోండి. తప్పకుండా వస్తావుకదూ. నీతో బోల్డు కబుర్లూ — కాకరకాయలు, విషయాలూ-విశేషాలుచెప్పాలి. అందుకని రేపు సాగర్‌కి మర్చిపోకుండారా, నిన్ను రేపు సాగర్‌లో కలుసుకుంటానని కలలు కంటూ నీ కోసం ఎదురు చూసే

నీ

రాధ.

ఉత్తరం ఆద్యంతం చదివి రేడియో క్రింద పెట్టి వంటపనిలో మునిగిపోయింది శారదమ్మ.

సాయంత్రం అయిపోయింది. ఉస్సురుమని వేలాడుకుంటూ వచ్చింది ఉష పుస్తకాలు టేబుల్‌మీద పడేసి బాత్‌రూంలోకివెళ్ళి కాళ్ళూ —చేతులూ కడుక్కుని వంటింట్లోకి వెళ్లింది. ఉషనిచూసి వాసంతి టిఫిన్ ప్లేట్‌లో పెట్టి ఉష ముందుకినెట్టి 'అయ్యో, అయ్యో ఏం దారుణం. ఏమిటమ్మాయ్. కాలేజీ చదువు వెలగబెడుతున్న భాగ్యానికే మొహం అలా వాడిపోయిందేం, ఉద్యోగం చేస్తానంటున్నావు మరి, అప్పుడెలా ఉంటుందో అమ్మాయిగారి మొహం చూసి తీరాల్సిందే మరి' అంటూ నవ్వింది.

'అఘోరించినట్లు ఉంది తెలివి! ఆఫీస్‌లలో ఆడపిల్లలు పన్చెయ్యరటగా. నువ్వు మేగజైనులలో చిట్స్ చూడడంలా హాయిగా 9 30 ని.కి అన్నం తిని ఆఫీస్‌కి వెళ్లటం, దారిలో ఏ లైబ్రరీలోనన్నా రెండు నవలలు తీసుకొని, ఆఫీస్‌కి వెళ్లటం, హాయిగా కుర్చీలో కూర్చుని టేబుల్‌మీద కాళ్లు బారచాపుకుని చదివినంతసేపు చదవటం, నిద్రపోయినంతసేపు నిద్రపోవడం, యీ మధ్యలో ఏ ఆఫీసరన్నా చెకింగ్‌కి వస్తే వాడి మొహాన ఒక చిరునవ్వు పడెయ్యడం, 5 గం.లు అవగానే కుర్చీలోంచి లేచి నిద్ర

మొహం కన్పించకుండా కర్చీఫ్ కొన్త నీళ్లలోముంచి మొహం తుడుచుకుని కొన్త లైట్‌గా కోటాకొట్టుకుని నీట్‌గా బయటికి వచ్చెయ్యడం, బస్‌లో సీట్ లేకపోతే ఎవడి మొహాన్నా స్వీట్‌గా చిరునవ్వు పారెయ్యడం, దాంతో వాడు ఐస్సైపోయి 'మేడమ్ యిలా కూచోండి' అంటూ ఆ ఫూల్ నిలబడటం, హాయిగా యింటికివచ్చి కడుపునిండా భోజనంచేసి కమ్మని కలలుకంటూ నిద్ర పోవటం యిందులో కష్టం ఏముందీ ? యిప్పుడు చూడు మరి. కాలేజికి వెళ్ళాలీ, లెక్చరర్స్ చెప్పేది వినాలీ, వినేది అండర్ స్టాండ్ చేసుకోవాలీ, నోట్సులు రాయాలీ, రికార్డులు రాయాలీ ఆ రాసిన వాటిమీద లెక్చరర్స్‌చేత సంతకం చేయించాలీ, గేమ్స్ టైమ్‌లో గేమ్స్ ఆడాలీ, ఎన్. సి. సి. లో మార్చింగ్ చెయ్యాలీ, యీ కష్టాలు చాలవన్నట్లు అప్పుడప్పుడు లెక్చరర్స్ పెట్టే ప్రైవేట్ క్లాసులకి హాజరుకావాలీ, అయ్యో వదినా, యీ కష్టం ఎంతలా చెప్పే నీ కర్థం అవుతుంది వదినా' ఉస్సూరుమంది ఉష. నవ్వాపుకోలేక అవస్త పడింది వాసంతి.

'సర్లే! చాలా కష్టపడ్డావు కానీ ఉదయం నీకో ఉత్తరం వచ్చింది చూడు. రేడియో కిందపెట్టాను' అంటూ పెరట్లోంచి వచ్చింది శారదమ్మ.

ఉత్తరం అనగానే టిఫిన్ అదరాబాదరా తినేసి కాఫీ తాగకుండా హాల్లోకి పరిగెత్తింది ఉష. 'ఎవరే అమ్మాయ్! ఆ రాధ మనింటికి ఎప్పుడన్నా వచ్చిందా' అంటూ ఉష వెనకాలే కాఫీ కప్పు తీసుకుని వచ్చింది శారదమ్మ. ఉత్తరం చదివిన ఉష ఒక నిముషం తెల్లబోయి తర్వాత తమాయించుకుని రాధ చిలిపితనానికి నవ్వుకుంది. నవ్వుకుంటున్న కూతురుని చూసి 'ఎందుకే! అంత నవ్వు వస్తోంది. ముందు కాఫీతాగు. చల్లారిపోతోంది ...'అంటూ కాఫీ కప్ చేతికిచ్చింది శారదమ్మ.

కాఫీ అందుకుని తాగుతూ 'చూడు. ఉత్తరం ఎంత చిలిపిగా రాసిందో. చదువుతుంటే నవ్వు వచ్చింది' అంది ఉష 'అది సరేకానీ, ఆ అమ్మాయికి మనిల్లు తెలీదేమిటీ సినిమా హాల్లో కలుసుకోమని రాసిందీ' అంది శారదమ్మ.

'తెలీదమ్మా! వాళ్ళిల్లు నాకు తెలియదు. మనిల్లు ఆమెకి తెలియదు పాపం! చాలా మంచిదమ్మా. తండ్రి లేడట. ఇక్కడ ఉద్యోగం చేస్తోంది.'

'అలాగా, అయితే రేపు మనింటికి రమ్మని చెప్పు ఒక్కసారి' అంటూ లోపలికి వెళ్ళిపోయింది శారదమ్మ ఉష నవ్వుకుంటూ వీక్లీలు తీసుకుని డాబా మీదికి వెళ్ళింది. యింట్లో పని అయినందు వలన వాసంతి కూడా జాజిపూలు తీసుకుని డాబామీదకి వచ్చింది.

'ఓయ్ బాబోయ్' అదంతా చదువే, ఇంత శ్రద్ధ క్లాస్ బుక్స్‌మీద ఉంటే బాగుండు. రేపు ఏ సినిమాకి ఉషా, నేను కూడా వస్తాను' అంది పూలు కడుతూ వాసంతి.

ఉష గుండెల్లో రాయిపడింది. అయినా వెంటనే తేరుకుని, 'నేను కాలేజీ నుంచి వెళ్ళిపోతాగా వదినా, రేపు ఆదివారం మనిద్దరం కలిసివెడదాం' అంది ఉష జాజిపూవుని వాసన చూస్తూ.

'సరేలే' అంటూ మాలను తుంచి ఉష జడలలో పెట్టి తనుకూడా పెట్టుకుంది వాసంతి.

'ఓ వాసూ, ఎక్కడున్నావ్' అంటూ పెద్దగా అరుస్తూ పైకి వచ్చాడు శేఖర్. 'ఇష్టాగోష్టి కార్యక్రమంలో మునిగిపోయారే వదినా మరదళ్లు. భోజనాలకి టైమ్ అయిందిట దొరసానులను అమ్మ రమ్మంటుంది'. 'మీరు వచ్చి ఎంతసేపైంది. రా ఉషా పోదాం, మీ అన్నయ్య వస్తే ఎనిమిది గంటలూ తంగున కొట్టేనట్లే. కింద అత్త గారు ఎదురు చూస్తూ ఉంటారు. నేను పోతున్నాను' అంటూ దిగిపోయింది వాసంతి.

భోజనంచేసి చదువుకుందామని పుస్తకం తెరిచింది ఉష. 'నీకూ నాకూ సంబంధం లేదు నేను నీతో కలవను' అంటూ ఉష మనసు కళ్ళెంలేని గుర్రంలాగా ఎక్కడో దూరతీరాలకు పరిగెత్తింది. 'రేపు రాధతో ఎలా మాట్లాడాలీ తను అసలే చిలిపి. ఉత్తరంలో ధోరణి చూస్తే యీ పదిహేను రోజుల్లోను యింకో డోస్ ఎక్కువైనట్లుంది.

'ఏమిటమ్మా నీ చదువూ, నువ్వూను. 9 గం.లకి యీ గదిలోకివచ్చి యీ కుర్చీలో కూర్చున్నావు. ఇప్పుడు పది అయింది. నీవు నన్ను గమనించలేదు, నీ చెయ్యి ఆ పేజీని తిరగవెయ్యలేదు. నీ కళ్ళు ఒక్క అక్షరం ముక్క కూడా చూడలేదు. పోనీ నిద్రపోతున్నావా అంటే కళ్ళేమో పత్తికాయల్లాగా విచ్చుకునే ఉన్నాయి. తే 'లే' కరెంట్ దండగ. ఏదో స్వప్నలోకంలో విహరిస్తుంటే ఫాన్ దండగకూడా ఎందుకు? యీ మధ్య ఏదైనా ప్రేమాయణంలో పడ్డావా ఏమిటి ఖర్మ' అంటూ గలగలా మాట్లాడుతున్న వాసంతి మాటలకు ఉలిక్కిపడి యీ లోకంలోకి వచ్చింది ఉష.

వదిన మొహంలోకి సూటిగా చూడలేక 'తలనొప్పిగా ఉంది వదినా' అంటూ పక్కమీదకు చేరింది.

తెల్లవారింది. యధాప్రకారం తన వేడి కిరణాలతో ఉషని వేడివేడిగా సత్కరించాడు ఉషా కాంతుడు. కిటికీలోంచి మొహాన ఎండ పడడంతో ఉషకి మెలకువ వచ్చి కనులువిప్పి అలవాటు ప్రకారం పక్కకి చూసింది. టేబుల్‌మీద గడియారం 8–30 ని॥ లు చూపిస్తోంది. అయ్యా బాబోయ్, యీ రోజు కాలేజికి లేట్ అయ్యేటట్లు ఉంది' అని అనుకుంటూ బాత్ రూమ్‌లోకి పరుగు తీసింది.

నీట్‌గా డ్రెస్ అయి భోజనం చేసి 9 గం॥ల కల్లా యింట్లోంచి బయల్దేరింది ఉష. కాలేజిలో అడుగు పెట్టేసరికి ఫస్ట్ బెల్ అయింది. గబగబా క్లాసురూం లోకి వెళ్ళింది. అప్పటికే లెక్చరర్ వచ్చాడు. గుమ్మం బయట నిలబడి 'మేఐ కమిన్‌సార్' అంటూ లెక్చరర్ వంక చూసింది ఉష. 'ఎస్. కమిన్' అని మళ్ళీ తన పనిలో మునిగిపోయాడు శ్రీధర్.

ఉష పరధ్యానంలో ఉండగానే మార్నింగ్ అవర్స్ కంప్లీట్ అయినాయి. మధు వచ్చి ఉషని వెనకచేత్తో పొడిచి 'రాణీగారు మేలుకునే కలలు కంటున్నట్టున్నారు. ప్లీజ్, యిప్పుడు ఏ లోకంలో ఉన్నారో గానీ అక్కడ్నుంచి త్వరగా భూలోకంలో ఉన్న యీ కాలేజీలోకి విచ్చేస్తే యీ లంచ్ టైమ్‌ని వేస్ట్ చెయ్యకుండా కాంటీన్‌లోకి పోయి కాస్త ఏదైనా టిఫిన్ చెయ్యచ్చు కమాన్' అంటూ ఉష పరధ్యానంలోంచి బయటకు వచ్చేలోగా ఆ చెయ్యి పుచ్చుకుని బరబరా లాక్కుపోయింది. బయట గుమ్మం దాటుతుంటే గడప తగిలి పూర్తిగా స్పృహలోకి వచ్చింది. తనెక్కడున్నదీ పూర్తిగా అర్థ

అయింది. వెంటనే గబగబా లోపలికి వెళ్లి బుక్స్ తీసుకుని 'అయామ్ సారీ మధూ, నేను యీ రోజు యింటికే పోతున్నాను. కాంటీన్ కి రాను. నాకు రేపు నోట్స్ యిస్తావా' అంటు ఉష మధురిమ వంక చూసింది. 'ఇస్తాను గానీ, ఏమిటో అంత రాచకార్యం మనలో మనమాట, ఏమైనా పెళ్లిచూపులూ గట్రా ఏర్పాటు చేశారా ఏమిటి ఖర్మ అయితే నేనుకూడా రానా. ఆ కోతిగారిని చూసి నేనుకూడా తరిస్తాను' అంది మధు నవ్వుతూ. 'నో నో నో, అటు వంటివి మనకి ఏంలేవుగానీ, అయినా నాకు వచ్చే పెళ్లికొడుకు కోతిలా ఉంటాడని నీ ఉద్దేశ్యమా' అంది ఉష చిరుకోపంలో.

'మరి కాక, అందంగా ఉండే వాళ్లకి అంద విహీనులని, కురూపులకు అందంగా ఉండేవాళ్లనీ ఏర్పాటు చేస్తాడుట భగవంతుడు. మరి యీ అందాల ఉషారాణికి కోతిగారు కాక యింకెవరు వస్తారంటావు. సరేలే, నువ్వేమో యింటికి పోయి కడుపు నిండా ఫుల్ గా తింటావు. నేనేమో నీ పేరు చెప్పుకుని మలమల మాడుతూ క్లాస్ లో కూచోవాలి నీకు మొగుడు ఎవలొస్తే నాకేంగానీ మా తల్లీ, లంచ్ టైమ్ యింక ఎనిమిది నిముషాలే ఉంది గానీ పోయిరా' అంటూ ఉషని విడిచి గబగబా కాంటీన్ కి దారి తీసింది మధు. వెళ్తున్న మధుని చూస్తూ నవ్వుకుని తను కూడా గేట్ వైపు బయల్దేరింది ఉష.

అర్ధగంట నుంచున్నా బస్ రాకపోయేసరికి యింక లాభం లేదనుకుని విసుగ్గా రిక్షా కేక వెయ్యబోయింది. యింతలో అంత అవసరం రానివ్వనులే' అంటూ వచ్చింది డబుల్ డెక్. సాగర్ కి టికెట్ తీసుకుని ఎక్కి కూచుంది ఉష.

'ఎవరమ్మాయివమ్మా నువ్వు' స్పష్టంగా ప్రశ్న వినిపిస్తున్నా తనను కాదన్నట్టు బయటకు చూస్తోంది ఉష.

'మిమ్మల్నేనండి' పక్క అమ్మాయి ఉషని చేత్తో తట్టి పిలిచింది. ఇదెక్కడి ఖర్మరా భగవంతుడా అనుకుంటూ 'ఏమిటి?' అంటూ యిటు తిరిగి చూసింది.

ఎవరమ్మాయివమ్మా నువ్వు, ఎక్కడో చూసినట్టుంది' అన్నాడు ఎదురు సీటులోని ముసలాయన లాంటి పడుచాయన.

'శేషా, రామారావుగారి అమ్మాయివి'

ప్రేమించిన పెళ్లికొడుకు

అంది ఉష ఆయనను చూస్తూ.

'ఎక్కడికి వెడ్తున్నావు సినిమాకా. ఒంటరిగా వెళ్తున్నావా! మీ యింట్లో అందరూ కలిసి వెళ్లరూ' ఆయన ప్రశ్నల వర్షం కురిపించాడు ఉషని పట్టి చూస్తూ.

ఆయన చూపుని భరించలేక 'అందరికీ ఒకసారి కుదరదు మాకు. ఎవరిష్టం వచ్చినట్లు వాళ్లు వెడతారు. అయినా నేనిప్పుడు సినిమాకి వెళ్లటం లేదు. కాలేజి నుంచి యింటికి వెడ్తున్నాను' అంది ఆయన చూపులు తప్పించుకుంటూ ఈయనకిదేం రోగమా అనుకుంటూ.

'అయితే ఎగ్జిబిషన్ కి పోదాం రారాదూ' ప్రేమగా, ఆదోవికారంగా చూస్తూ అన్నాడు ఆయన.

ముసలితనం వస్తున్నా వెధవ బుద్ధి పోలేదు వీడి దుంపతెగా అనుకుంటూ 'ఇప్పట్నించీ ఎగ్జిబిషన్ కి ఏమిటి మా స్టాపు వచ్చింది. నేను దిగిపోతున్నాను తాతగారూ' అంటూ పక్కనున్న పుస్తకాలు తీసుకుని దిగిపోతూ ఆ తాతగారిలాంటి ఆయన మొహం చూసింది. 'తాతగారన్న మాటకు ఆ ముసలి యువకుడి మొహం కత్తివాటు రక్తపుబొట్టు లేకుండా పాలిపోయింది.

జరిగినదంతా గుర్తుతెచ్చుకుని నవ్వుకుంటూ రాధకోసం చూసింది చుట్టుపక్కల. కానీ రాధ వచ్చిన జాడ కన్పించలేదు ఎక్కడా. 'అబ్బా బాగా ఆకలి వేస్తోంది. రాధ త్వరగావస్తే బాగుండు హోటల్ కిపోయి యిద్దరం కలిసి టిఫిన్ చెయ్యచ్చు' ననుకుంటూ రోడ్డువైపు చూడసాగింది. ఇంతలో వెనకనించి 'ఉషా' అన్న కేక విన్పించింది. వెనక్కి తిరుగుదామనుకుని తిరగబోయి దూరాన స్కూటర్ మీద వస్తున్న వ్యక్తిని చూసి ఆగిపోయింది ఆ ప్రయత్నం విరమించుకుని. ఎవరోకాదు అతను తన అన్న శేఖర్. అతను ఉషకి రెండుగజాల దూరాన ఉన్నాడు. యింతలో శేఖర్ ఫ్రెండ్ పిలవటంతో స్కూటర్ ఆపి పేవ్ మెంట్ మీద నిలబడి మాట్లాడసాగాడు. తనను పిలుస్తూ దగ్గరగావచ్చిన రాధని చూసి చిరునవ్వు నవ్వుతూ శేఖర్ ని చూసి 'మా అన్నయ్య శేఖర్' అన్నది ఉష.

'అలాగా' అని నవ్వి 'అబ్బో' చాలా త్వరగా విచ్చేసారే ఉషారాణిగారు. మీరు ఇక్కడికి రావడం ఎగ్గొడ్తారేమో ఆ ఆశాభంగాన్ని ఎలా ఓర్చుకోవాలాం అని మథనపడుతున్న యీ రాధకి మీరాక ఆత్మానందం కలుగచేసిందనడం ఏమాత్రం అతియోక్తి లేదు. మీరు నమ్మాలి ఉషాకుమారీ' అని తనను వెక్కిరిస్తున్న రాధని చూసి 'ఆ ఆ ఇంకా మీరు అలాగే కబుర్లుచెప్తూ కూచోండి. నేనూ, నా ఆత్మారాముడు అర్ధగంటనుంచి మీకోసం ఎదురు చూస్తున్నాము. వచ్చికూడా మీరు యింకా అలాగే నిలబడుతూ బాతాఖానీ వేసుకున్నారంటే నా ఆత్మారాముడు మిమ్మల్నీ, నన్నూ కూడా మింగేస్తాడు అందుకని ముందు హోటల్ తర్వాత కబుర్లూ విశేషాలు' అంటూ పక్కనున్న హోటలుకు దారితీసింది. అనుసరించటం రాధ వంతైంది.

టిఫిన్ ముగించి హోటల్ నుంచి బయటకు వచ్చారు. సినిమాకి యింకా పది నిముషాలు టైముంది. 'సినిమాకి పోదామా ఉషా' లేకపోతే హాయిగా అలా పబ్లిక్ గార్డెన్స్ కి వెడదామా' అన్న రాధ ప్రశ్నకు సమాధానంగా 'నేనూ అదే అడుగుదామనుకుంటున్నాను రాధా. యింతలో మీరే అడిగారు. అది ఒకసారి చూసిన సినిమానేకదా, ఒకసారికే బోర్ గా ఉంది. యింకా రెండోసారి వెళ్లాలంటే డజన్ ఆస్ప్రోలు, రెండు అమృతాంజనం సీసాలు. మూడు ఫ్లాస్కుల కాఫీ తీసుకుపోవాలి. అంత శ్రమపడటం నాకు యిష్టం లేదు కనక హాయిగా పబ్లిక్ గార్డెన్స్ కే పోదాము' అని ఎదురుగా వస్తున్న రిక్షాని కేకేసింది. ఇద్దరూ రిక్షాలో కూర్చున్నారు. రిక్షా సాగిపోతున్నంతసేపూ రోడ్డు పొడుగునా కనబడ్డ ప్రతి మనిషిమీదా ఏదో కామెంట్ చేస్తూనే ఉంది ఉష. 'తప్పు ఉషా, ఒకళ్లగురించి మనం అనుకుంటుంటే వాళ్లూ ఏదో మనల్నిగురించి అనుకుంటూనే ఉంటారు. అది చదువుకున్న వాళ్లు చేసే పనికాదు. అది సంస్కారహీనులు చేసే పని' అని వారించబోయిన రాధని 'ఓయబ్బో. మహా సంస్కారవంతులు బయల్దేరారు. యికనేం యీ భారతదేశం బాగుపడిపోతుంది. కానీ ఆ సంస్కరణేదో ముందు నాతోనే మొదలు పెట్టినట్టున్నారు తమరు. అయినా కొంచెం 'సెన్సాఫ్ హ్యూ

రుండాలి రాధగారూ. మనం వాళ్ళగురించి అనుకోము అనుకొండి. కానీ వాళ్ళు మనని గురించి ఏమీ అనుకోరని గ్యారంటీ ఏమిటో కొంచెం సెలవిస్తారా' ఎగతాళిగా అంది ఉష.

'ఏమిటో ఉషా, నీ అల్లరి ఎక్కువవుతోంది. నిన్నేంచెయ్యాలో నాకేమీ అర్థం కావడంలేదు. మనం అనుకోపోతే వాళ్ళు కూడా ఏమీ అనరాఅని అడిగావు వాళ్ళు గడ్డితింటారని తమరు తింటారా ఉషాకాంతిగారు'. 'అవస్యం, వాళ్ళు ఒక బండి గడ్డి తింటే నేను రెండుబళ్ళు తినటం ఖాయం, అంటే బళ్ళు కాదనుకోండి. అందులో గడ్డి' అంటూ సీరియస్‌గా ఫోజ్ పెట్టింది ఉష

'అబ్బబ్బ, ఒట్టి జగమొండి ఆ వచ్చే మొగుడు ఎలాంటివాడు వస్తాడోగాని వాడు మూడురోజుల లోపున ఔమ్మని చావనైనా చస్తాడు. లేకపోతే సన్యాసుల్లోనన్నా కలిసిపోతాడు'.

'అలాగా, అయితే మా ద్దాం తే వివారు చెప్పినట్లే జరిగితే యింకో మొగుణ్ణి వెతికి తెచ్చే బాధ్యతకూడా మీదేసుమా'.

'బాగుంది ఆ పాపమంతా నాకా, అంతమంది అమాయకుల్ని ఉసురుపెట్టినందుకు నేను ఏ రౌరవాది నరకానికో పోవాలి. అంత పని నావల్లకాదు సుమా'.

రిక్షా పబ్లిక్ గార్డెన్స్ ముందు ఆగింది ఇద్దరూ దిగి పైసలిచ్చి లోపలికి నడిచారు. ఉష ఒక పావలా వేరుసెనగకాయలు పొట్లం కట్టించుకుంది.

'ఏమిటీ అంతలావు రాచకార్యం అంతా వివరంగా చెప్పండి. సావధానంగా చిత్తగిస్తాము' తాపీగా కూచున్న తర్వాత అడిగింది ఉష.

'పాపం! అందరూ ఈవిడగారి దయాధర్మం మీద ఆధారపడినట్లున్నారు అయినా అంతలావు రాచకార్యాలు ఏమున్నాయి. ఏదో తమరిని చూడాలన్పించింద చూసాను. యింకొకటి కూడా ఉంది. చెప్పమంటావా! ఈ ఉషకి రాధంటే యిష్టమో మధురిమంటే మక్కువో తెల్సుకోవాలన్పించింది. దీనిని బట్టి విషయం నాదిలాగావే కన్పిస్తోంది. ఏమంటావు ఉషా!'

'నా నెత్తి. అనేందుకే మున్నది. నన్ను పరీక్ష చేసారన్నమాట. యింతోటి మాట సెలవిచ్చేందుకేనా కాలేజీ ఎగ్గొట్టించారు' అంటూ టైము చూసుకుని 'అబ్బ. అప్పుడే 6–30ని. శాంతి. యింక వస్తాను' అంటూ లేచి నిలబడింది ఉష.

'అయితే మళ్ళీ పునర్దర్శనం ఎప్పుడో'

'హల్లో ఉషా! ఇక్కడున్నావా! అయామ్ సారీ! మిమ్మల్ని డిస్టర్బ్ చేసినట్లున్నాను. వస్తాను' అంటూ ఎక్కడి నుంచో ఊడిపడ్డ మధురిమ ఉష మాట్లాడేందుకు అవకాశము యివ్వకుండా ఎలా వచ్చిందో అలానే వెళ్ళిపోయింది.

'ఆమే గదా మధురిమ'

'అవును—ఇంక నేను పోతాను. ఆలస్యమైతే యింటి దగ్గర మా అమ్మ తంతుంది. అంటే నిజంగా తంతుందని కాదు. తన్నినంతపని చేస్తుంది. అందుకని యీరోజుకి యింక గుడ్–బై' అంటూ చకచకా వెళ్ళిపోయింది వెనక నించి రాధ పిలుస్తున్నా విన్పించుకోకుండా.

'వెధవ బస్‌స్టాప్. యింటికి అరమైలు దూరంలో తగలడింది. పూర్తిగా 7–30 కాలేదు. అప్పుడే రోడ్డంతా నిర్మానుష్యమైపోయింది. ఛీ—ఛీ. యిప్పుడు ఒకదాన్నీ బిక్కు బిక్కుమంటూ పోవాలి' అని లోలోన సణుక్కుంటూ పైకి ఎంతో బింకంగా నడుస్తుంది ఉష.

'హల్లో డార్లింగ్, కొంచం నెమ్మదిగా నడు ముందు వద్దామంటే పళ్ళు పదారూ రాలిపోతాయి. రేపు కట్టుడు పళ్ళు పెట్టుకుని బడికి పోతే ... వాచిట్టి తల్లీ, నీ ఆవస, చెప్పాలా, అందుకని కొంచం నెమ్మదిగా నడు' గంభీరమైన మగగొంతు; దానికి లయగా బూట్ల టకటకలు విన్పించాయి వెనకనించి ఉషకి. గుండెలు జారిపోయాయి. భయపడ్డా నే నడక వేగాన్ని కొంచెం ఎక్కువచేసింది. 'ఓరీ నీ దుంపతెగ' అనుకుంటూ.

'ఏం! నీ అంత త్వరగా నేను నడవలేననుకున్నావా నా ముద్దులగుమ్మా. నిన్ను అవలీలగా ఒంటిచేత్తో గిరగిరాతిప్పి యింటి దగ్గర పడేటట్లు గిరవాటేస్తాను చూడు.'

భయపడుతూ నడుస్తున్న ఉష గుండె ఒకసారి ఆగిపోయినట్లయింది తన అసహాయస్థితికి కళ్ళనుంచి నీళ్ళు గిర్రున తిరగ్గా అవి కిందకి కారకుండా బలవంతాన నిగ్రహించుకుని 'ఇడియట్' యిట్లాగే యింటిదాకా రా, గూర్ఖా, నౌకర్లతోటి నిన్ను చట్నీ చేయిస్తానురా యూస్‌లెస్ ఫూల్' బయటకు అనటానికి ధైర్యం చాలక లోలోన తిట్టుకుంటూ పళ్ళు పటపటా కొరికింది ఉష. ఆ సమయంలో తలని వెనక్కి తిప్పటానికికూడా ధైర్యం చాల్లేదు.

యింతలో వెనకనించి సన్నగా కిలకిలారావం విన్పించింది ఒక్కసారి అదిరిపోయింది ఉష అరె, యిందాకట్నించి అతను అనేది తనను కాదన్నమాట ఒక్కసారి కూడా తల వెనక్కి తిప్పలేని తన ధైర్యం చూస్తే తనకే నవ్వు వచ్చింది. యిప్పుడు తాపీగా తలని వెనక్కి తిప్పింది.

'సోసోయి, పెద్ద కోతలు కోస్తావు. అయినా మామయ్యా మరి యింతదూరం వాతో నీవు కష్టపడి ఎందుకు వచ్చినట్లు,



యింటిదగ్గరనుంచి నువ్వు నన్ను విగ్గి విషన్‌తో గిరవా పెడితే అక్కడంతా చూసి ఏవడైనా నీలాంటివాడిచేత యింటిదగ్గర గిరవా పెయించుకు పేదాన్ని. అక్కడనుంచి వరాసరి యింటిదగ్గర నీ ఒళ్లో పడే దాన్ని.' తొమ్మిది పదేళ్ల పిల్ల వాళ్ల

ప్రేమించిన పెళ్లికొడుకు

మామయ్యని ఆటలు పట్టిస్తూంది. వాళ్ళని చూసి నవ్వుకుంది ఉష.

* * *

ఉదయం హాల్లో అందరూ కాఫీ టిఫిన్స్ సేవిస్తున్నారు. ఉన్నట్టుండి ఉష తండ్రి రామారావుగారు 'శారదా, మొన్న బజార్లో మా పెద్దనాన్నగారి అమ్మాయి జానకి కన్పించింది. జానకి నీకు గుర్తు ఉండే ఉంటుంది. ఎర్రగా పొడుగ్గా ఉండేది చూడు. ఎవర్నో ప్రేమించి మా పెదనాన్నతో

సరసమైన ధరకు స్థాపితమైన రకపు ఉక్కు

టాటా స్టాక్ యార్డు నుండి మీకు కావలసిన ఉక్కు సరకులు కొనునప్పుడు సరసమైన ధరకు మీ పనికి తప్పితముగా సరిపోవు స్థాపితమైన రకపు ఉక్కు లభించును. ప్రతి అవస్థయందు శాస్త్రీయ పద్ధతులలో నిపుణులచేత పరీక్షించబడి ఉత్పత్తి చేయబడునది యీ ఉక్కు.

అంతేకాక మీకు లభించునది మరికొంత....ఉక్కును వుపయోగించునప్పుడు మీకు కలుగు సమస్యలను పరిష్కరించుటకు టెక్నికల్ విషయాలలో (మీకు అవసరమైనప్పుడు) వుచితముగా సలహాలు, సహాయము ఇవ్వబడును.

టాటా స్టీల్‌వారి 11 బ్రాంచ్ ఆఫీసుల వర్గము ఖాతాదారులకు మర్యాదగా, అతి సమర్థవంతముగా సేవచేయుటకు తోడ్పడుచున్నది. ఇది. మొదటినుండి అనగా గత 60 సంవత్సరములనుండి కంపెనీవారు అనుసరించు నీతి సూత్రము. మీకు కావలసిన ఉక్కు సరకులకు మీ సమీపమందున్న మా బ్రాంచ్‌కి వ్రాయవలెను.

ది టాటా ఐరన్ అండ్ స్టీల్ కంపెనీ లిమిటెడ్

హెడ్ సేల్స్ ఆఫీసు: 23 B, నేతాజీ సుభాష్ రోడ్, కలకత్తా-1

బ్రాంచీలు:

ఇంపీరియల్ రెస్టారెంట్
(3rd ఫ్లోర్) రిలీఫ్ రోడ్
అహమ్మదాబాదు

80-J మహాత్మాగాంధీ రోడ్
బెంగుళూరు

న్యూ ఇండియా ఎష్యూరెన్స బిల్డింగ్సు
మహాత్మాగాంధీ రోడ్, ఫోర్టు
బొంబాయి

శివర్కా బిల్డింగ్
మహాత్మాగాంధీ రోడ్
ఎర్నాకులం

గ్రాండ్ ట్రంక్ రోడ్
సివిల్ లైన్సు
జలంధర్ సిటీ

మారోత్ బిల్డింగ్స్
మహాత్మాగాంధీ రోడ్
కాన్పూరు

108-అర్మేనియన్ స్ట్రీట్
మద్రాసు

[illegible] రోడ్
నాగపూరు

శ్యాం భవన్
15/1 ఆసఫ్ ఆలీ రోడ్
న్యూ ఢిల్లీ

128 సరోజినీదేవి రోడ్
సికందరాబాదు

ఆంధ్రా బ్యాంక్ బిల్డింగ్స్
రాజా రంగయ్యప్పారావ్ స్ట్రీట్
విజయవాడ

TIS 2061[illegible]

యిన్ని లేక కేకలేస్తే 'అతన్తో యిల్లు విడిచి వెళ్ళిపోయింది చూడు జానకి పాపం భర్త పోయాడుట. నన్ను చూసి బజార నైనా చూడకుండా గావురుమంది. 'ఆయిన వాళ్ళేవరూ కాకుండాపోయారు. ఈవాళ్ళికి నీవు కన్పించావు' అంటూ. దానికి ఒక కొడుకు. ఇరవైఆయిదేళ్ళుంటాయి. చాలా బాగున్నాడు. ఎం.ఎస్సీ ఫస్ట్‌క్లాస్‌లో పాస్ అయ్యాడట 'ఒకసారి వదినా పిల్లల్నందరీ తీసుకురా అన్నయ్య' అంటూ ఏడ్చేసింది. వాడు అంటే దాని కొడుకు కూడా చాలా బాగా కలుపుగోలుగా మాట్లాడాడు. ఈరోజు ఆదివారమే కదా. అందరం సరదాగా అలా పోయొద్దాం' అన్నారు.

'అలాగా, పాపం, ఎలా ఉంటోందో ఏమిటో ఒక్కతీ. సాయంకాలం పోదాం' అంటూ పనిమీద లోపలికి వెళ్ళిపోయింది

'ఏమిటేమిటే, అంతా కలగా ఉంది. యీ ఊళ్ళో నాకో అన్నయ్యా మా ఉషకో మొగుడూ ఉన్నారన్న మాట. యింకేం, మా ఉషమ్మ పెళ్ళికూతురాయెనే. మా ఉషమ్మకి కాబోయే మొగుడు పెళ్ళికొడుకాయెనే' అంటూ ఆడబిడ్డని ఆటలు పట్టించపోగింది వాసంతి. ఉష వదిన నెత్తిన ఒక చిన్న మొట్టికాయ మొట్టి లోపలికి తుర్రుమంది.

సాయంత్రం అందరూ బయల్దేరారు. రానని మొరాయిస్తున్న ఉషని ఏడిపించి మరీ లాక్కెళ్ళింది వాసంతి.

ఒక అందమైన చిన్న బంగళాని చూసి 'యిదే' అని లోపలికి దారి తీసారు రామారావుగారు. అందరూ అనుసరించారు. ముందున్న గార్డెన్‌లో ఒక సిమెంట్ చప్టా మీద కూచుని పుస్తక పఠనలో నిమగ్నుడైన ఒక యువకుణ్ణి చూసి శిలాప్రతిమే అయింది ఉష. అయితే తను వచ్చింది ... ఉష ఊహ పూర్తి కాకుండానే 'అదేమిటమ్మా! అలా నిలబడిపోయేవు అతను ఎవరనుకున్నావు? నీ బావ! జానకమ్మ కొడుకు రాధాకృష్ణ' అన్నారు రామారావు.

ఆ మాటలకి ఏకాగ్రత చెదిరిపోగా పుస్తకం మీదనుంచి దృష్టి మరలించాడు అతను. క్షణకాలం తన కళ్ళని తానే నమ్మలేకపోయాడు. కలో, వైష్ణవ మాయో అర్థం చేసుకోలేకపోయాడు! తన రాణి, ఉషారాణి తన యింటికి వచ్చింది. మరి వాళ్ళంతా ఎవరు! ముందున్నది మొన్న బజార్లో కన్పించిన రామారావు మామయ్య. వాళ్ళంతా వాళ్ళ కుటుంబం అయిఉండాలి. అయితే ఉష తనకి... రాధ ఊహ పూర్తి కాకముందే రామారావుగారు పలకరించారు. 'ఏమోయ్! అమ్మ యింట్లో ఉందా' అంటూ. ఊహా లోకంలోంచి బయటికి వచ్చాడు రాధ. 'ఆ ఆ ఉంది. పదండి' అంటూ ముందుకి దారి తీసాడు. వరండాలోనే ఎదురైంది జానకమ్మ అందరినీ ఆదరంగా ఆహ్వానించింది. ఉషని దగ్గరికి తీసుకుంటూ 'నీ కూతురా అన్నయ్యా, అయితే నా కోడలన్నమాట' అంటూ ఆప్యాయంగా ఉష తల నిమిరింది జానకమ్మ. 'మళ్ళీ మాట తప్పిపోరాదు పిన్నిగారూ. అయినా మీరు మరీ ముందు వెనకలు చూసుకోకుండా అన్నారు. ఆవిడెంత గయ్యాళో నే నెట్లా చెప్పేది. సూర్యకాంతానికన్న నూరు రెట్లు పవరెక్కువుంది. మరి మీరూ, అన్నయ్యగారూ ఎలా నెగ్గుకొస్తారో నాకంతా అయోమయంగా ఉంది' ఉస్సూరు మంటూ నిట్టూర్పు విడిచింది వాసంతి.

'మరీ నీ దంతా సోద్యమే అమ్మాయీ. పిల్లని చూస్తుంటే అసలు నోట్లో నాలుక ఉందా లేదా అని అన్పిస్తోంది. ఎంత వదినవైనా మరీ అంత ఘాటా' వెన కేసుకు వచ్చింది జానకమ్మ ఉషని.

'నిజమేనమ్మా, ఆవిడ చెప్పినమాట నేనూ ఒప్పుకుంటున్నాను. అసలు నేనే యీమెని ఒకనాడు తీసుకువచ్చి నీ కోడలని పరిచయం చేద్దామనుకుంటున్నాను. అంతలో యీమె అత్తగారిని వెతుక్కుంటూవచ్చింది' అన్నాడు రాధాకృష్ణ.

'అయితే మీ కిదివరకే పరిచయముందన్న మాట' ఆవులించింది వాసంతి. 'నే నను కుంటూనే ఉన్నాను యీ మధ్య ఉష వరస చూసి'. 'నీ కెలా పరిచయమే యితడు' కూతుర్ని అడిగింది శారదమ్మ. 'ఏముందీ ఒకనాడు బస్‌లో నాతో దెబ్బలాడేసు కున్నాడు ఓ.కా ప్రబుద్ధుడు. మళ్ళీ ఒక రోజు కాలేజి ముందు కన్పించి 'గుర్తున్నానా' అంటూ మాట కలిపాడు. అలా పరిచయం పెరిగింది. నీకు తెలీదు గాని మొన్న ఒక ఉత్తరం వచ్చింది చూడు. రాధ రాయలా, ఆ రాధ ఎవరనుకున్నావ్. ఈ రాధాకృష్ణే' అంటూ నవ్వింది ఉష. 'ఓసి నీకా తెలివి బంగారంగానూ, రాధంటే నేను ఆడపిల్లనుకున్నాను.' ముక్కుమీద వేలేసుకుంది.

నెల తిరక్కుండానే కుమారి ఉష శ్రీమతి ఉష అయింది. పెళ్ళికి వచ్చిన మధురిమను చూసి 'మధూ 'మా కోతి గార్ని చూసావా అని రాధతో 'యిది నాతో పందెం వేసింది, నాకు కోతిలాంటి మొగుడు వస్తాడని' అంది ఉష చిలిపిగా.

'నాకేం తెలుసు నువ్వో పెళ్ళికొడుకుని ప్రేమించి నాతో వాదనకు దిగావని' అంటూ మధు ఉష నెత్తిన మొట్టింది చిన్నగా, వాళ్ళిద్దర్నీ చూసి నవ్వుకున్నాడు రాధ. ●